క్లుప్తంగా

విజేతలకు బహుమతుల పంపిణీ

చీరాల అర్బన్: ఆర్టీసీ చీరాల డిపోలో నిర్దేశించిన రూట్లలో ప్రయాణించే ప్రయాణికులకు ఆర్టీసీ లక్కీ ప్యాసింజర్ స్కీం ప్రవేశపెట్టినట్లు డిపో మేనేజర్ జె.శ్యామల తెలిపారు. చీరాల నుంచి ఇంకొల్లు వయా తిమ్మసముద్రం, స్వర్ణ మీదగా వెళ్లే బస్సుల్లో కార్యక్రమాన్ని చేపట్టగా శనివారం సాయంత్రం డిపోలో డ్రా తీశారు. డ్రాలో మొదటి బహుమతి హనుమోజిపాలేనికి చెందిన ఏసు కుమారి, ద్వితీయ బహుమతి తిమ్మసముద్రానికి చెందిన మల్లేశ్వరి గెలుచుకున్నారు. ప్రయాణికులు తమ టిక్కెట్ల వెనుక పేరు, ఊరుపేరు, ఫోన్ నంబర్‌ను రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం బాక్సుల్లో వేయాలన్నారు. ప్రతి నెల 3, 17 తేదీల్లో డ్రా తీసి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

గ్రంథాలయంలో ఉచిత పుస్తకాలు పంపిణీ


పుస్తకాలను ఎంపిక చేసుకుంటున్న విద్యార్థులు, ప్రజలు

వేటపాలెం: స్థానిక సారస్వత నికేతన గ్రంథాలయంలో ఉచిత పుస్తకాలు పంపిణీని గ్రంథాలయ పాలకవర్గ సభ్యుడు కాకరపర్తి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. విజ్ఞానాన్ని మరింత మందికి అందించాలనే ధ్యేయంతో ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు దాదాపు 7 వేల పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. ప్రదర్శనకు ఉంచిన పుస్తకాలను తీసుకెళ్లడానికి విద్యార్థులు, ప్రజలు ఎందరో తరలివచ్చారు. పట్టణంలో ఎవరి వద్దయినా ఉపయోగించుకోకుండా ఉన్న పుస్తకాలను లైబ్రరీకి ఇవ్వడం ద్వారా కార్యక్రమంలో భాగస్వాములు కావొచ్చని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి రాగి తీగ చోరీ

జే.పంగులూరు: వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో రాగి వైరును దొంగలు తీసుకెళ్లటం షరా మామూలైంది. ఈ ఏడాది కాలంలో మండలంలోని ముప్పవరం గ్రామంలోని పరిసర ప్రాంతాల్లో 13 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరును దుండగులు అపహరించారు. ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలు కావడంతో పంటలకు నీరు అందక ఎండపోయే ప్రమాదం ఉందని, వర్షాలు కూడా సకాలంలో కురవడం లేదని రైతులు రౌతు రాఘవయ్య, దాసరి వెంకట్రావు, దాసరి రాముడు తెలిపారు. ఈ మేరకు రేణింగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను పట్టుకొని వెంటనే శిక్షించాలని, పంటలు ఎండిపోకుండా విద్యుత్ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని కోరారు.

వినియోగదారులకు అవగాహన తప్పనిసరి

చీరాల టౌన్: వినియోగదారులకు ఉన్న హక్కులను గురించి విధిగా అవగాహన కలిగి ఉండాలని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదులు తీసుకోవాలని మేలుకొలుపు కన్స్యూమర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి దాసరి ఇమ్మానియేల్ సూచించారు. వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని లూథరన్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కల్తీ లేని ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, కమిటీ మెంబర్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు పుష్పరాజ్, సుమ ఉన్నారు.

నేడు కార్తీక మహాత్మ్యం ప్రవచనం

చీరాల రూరల్: స్థానిక స్వర్ణ రోడ్డులోని రైల్వే గేటు వద్దగల లయన్స్ క్లబ్ ట్రస్టు బిల్డింగ్‌లో ఆధ్యాత్మిక పీఠం చీరాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు కార్తీక మహాత్మ్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు పీఠం అధ్యక్ష, కార్యదర్శులు బీవెంకటరావు, ఎంఎస్. ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపన్యాసకులుగా తెనాలికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ నోరి కోదండరామ్ వ్యవహరించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆధ్యాత్మికంగా ఎదగాలని వారు కోరారు.


మార్టూరులో మిరప రైతులతో మాట్లాడుతున్న అధికారులు


రామాపురం సముద్ర తీరం వద్ద పరిశీలిస్తున్న అధికారులు


పెదగంజాంలో తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు

దూసుకొస్తున్న మిచాంగ్ తుఫాన్

- మత్స్యకారులు వేటకు వెళ్లకండి
- అధికారుల హెచ్చరికలు
- అప్రమత్తమైన యంత్రాంగం

చీరాల టౌన్: మిచాంగ్ తుఫాన్ కారణంగా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. శనివారం మండలంలోని వాడరేవు, విజయలక్ష్మీపురం తీర ప్రాంత గ్రామాలను తహశీల్దార్, పంచాయతీరాజ్, రెవెన్యూ, మెరైన్ పోలీసులు పర్యటించారు. సముద్ర తీరం ఒడ్డున ఉన్న వలలు, పడవలను సురక్షిత ప్రదేశాలకు పంపించడంతో పాటుగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా గ్రామాల్లో దండోరా వేయించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ తీరం దాటే సమయంలో భారీ వర్షాలు కురుస్తాయనే ఆదేశాలతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అన్నీ చర్యలు చేపట్టామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు భవనాలు, మంచినీరు, ఆహారం, జనరేటర్లు సిద్ధం చేశామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాడరేవు సచివాలయంలో రెవెన్యూ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. 70134 52299 కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశామని తహశీల్దార్ తెలిపారు. వాడరేవు తీర ప్రాంతానికి పర్యాటకులను అనుమతించమని, ఎవరూ తీరానికి రావద్దని ఆదేశాలు జారీ చేశారు.

తుఫాన్ పునరావాస కేంద్రాల పరిశీలన..

చినగంజాం: ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉంటుందనే ఉన్నతాధికారుల హెచ్చరికలతో పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచుతున్నామని తహశీల్దారు పీ పార్వతి అన్నారు. శనివారం ఆమె మండంలోని పెద గంజాం పల్లెపాలెంలో పర్యటించి అక్కడ ప్రజలు, మత్స్యకారులతో మాట్లాడారు. అక్కడ వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. అనంతరం అక్కడే ఉన్న తుఫాన్ షెల్టర్‌ను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలను సరిచూసుకోవాలన్నారు. ఏర్పాట్లపై ఆమె సిబ్బందితో చర్చించారు.


చీరాలలో మత్స్యకార సొసైటీ నాయకులకు నోటీసులు అందిస్తున్న మత్స్యశాఖ ఉద్యోగులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి..

కారంచేడు: వాతావరణ శాఖ హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక జాగ్రత్తలు, చర్యల పట్ల అన్నదాతలు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి కే సుధీర్‌బాబు అన్నారు. శనివారం ఆయన మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ ప్రాంతాల్లోని అన్నదాతలతో మాట్లాడారు. 'మిచాంగ్' తుఫాన్ ప్రభావం ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మన ప్రాంతాల్లో తీవ్రంగా ఉండబోతుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారన్నారు. మన ప్రాంతంలో ప్రధానంగా వరి సాగు దుబ్బు, పొట్ట, కోత దశల్లో ఉన్నాయన్నారు. గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉన్న చేలల్లో సత్వరమే కంబైండ్ హార్వెస్టర్ ద్వారా వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. తడవకుండా ఆరబెట్టుకోవడంతో పాటు, టార్పాలిన్, పాలిథిన్ పట్టాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పంటను కోసి, పనలు చేలల్లో ఉన్న రైతులు తక్షణమే పనలను కట్టలు కట్టి గూడు, కుప్పలుగా మార్చుకోవాలన్నారు. మెట్ట పంటలుగా ఉన్న పత్తి, మిరప చేలల్లోను వర్షపు నీరు నిల్వలుండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పైగ్రామాలకు చెందిన వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


ఉప్పమాగులూరులో పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న కుమారి

వేటపాలెం: మిచాంగ్ తుఫాన్‌గా మారనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కే నేతాజీ హెచ్చరించారు. మండల పరిధిలోని సముద్రతీర ప్రాంతాలైన రామాపురం, కఠారివారిపాలెం తీరప్రాంతాలను అధికారులు శనివారం పరిశీలించారు. వీరి వెంట ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, కార్యదర్శి పూర్ణకుమారి, సిబ్బంది ఉన్నారు.

మార్టూరు: రానున్న తుఫాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కిరణ్‌కుమార్, హెచ్‌ఓ బీ హనుమంతనాయక్‌లు అన్నారు. శనివారం మండలంలోని రాజుపాలెంలో పత్తి, మిరప చేలను పరిశీలించి వర్షపు నీరు భూముల్లో నిలవ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలల్లోను తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన మాట్లాడారు. మార్టూరులో పంటలను కూడా వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా మిరప చేలల్లో ఆకుముడత, కొమ్మకుళ్లు, వేరుకుళ్లు, తామరపురుగు నివారణలకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు.

బల్లికురవ: ఏవో ఎస్వీపీ కుమారి మండలంలోని ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కొప్పెరపాలెం ప్రత్తి సాగు చేసిన పొలాలను ఆమె పరిశీలించారు. తుపాను దృష్ట్యా పగిలిన పత్తిని వెంటనే తీయించుకుని భద్రపరుచుకోవాలని, మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని కుమారి వివరించారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలి


స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: జనానికి మేలు చేసిన జగనన్న ప్రభుత్వానికి మళ్లీ ఓటు వేసి గెలిపించాలని ఏపీ శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణచైతన్య పేర్కొన్నారు. మండలంలోని ధేనువకొండ గ్రామంలో ఆయన శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి ఆ ఇంట్లోని కుటుంబ సభ్యులకు ప్రభుత్వపరంగా ఏయే పథకాలు అందాయో, ఎంత లబ్ధి చేకూరిందో తెలిపే పత్రాలు పంపిణీ చేశారు. వృద్ధులు, యువకులను, అక్కచెల్లెమ్మలను పలకరిస్తూ ముందుకు సాగారు. ఏదైనా ఇబ్బంది ఉన్నచోట్ల వారికి వచ్చిన ఇబ్బందిని తెలుసుకొని అధికారులకు పరిష్కారం చేయాలని సూచించారు. ఈసందర్భంగా చైతన్య మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించబోతోందన్నారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తానెప్పుడూ కట్టుబడి ఉన్నానని వివరించారు. ప్రతిపక్షం కుట్ర రాజకీయాలు చేస్తోందన్నారు. ఆ విషయం అందరికీ తెలిసిపోయిందని మళ్లీ ఎన్నికలు దగ్గరపడే సమయానికి ఎప్పుడూ బయటకు రాని నాయకులు ప్రజల్లోకి వచ్చి సానుభూతి పొందాలని చూస్తున్నారన్నాని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గుజ్జుల జగన్ మోహన్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ రామిరెడ్డి ఆదిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

తుఫానులో విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

చీరాల అర్బన్: మిచాంగ్ తుఫాను నేపథ్యంలో చీరాల డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా అంతరాయంలో సేవలందించేందుకు విద్యుత్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఈఈ జాన్ థామస్ అన్నారు. 24 గంటలు కంట్రోల్ రూం అందుబాటులో ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా, విద్యుత్ లైన్లు తెగిపోయినా కంట్రోల్ రూం నెంబర్ 94408 17597కు గాని సిబ్బంది, అధికారులకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. తెగిపడిపోయిన విద్యుత్ తీగలను తాకవద్దని, దూరంగా ఉంచాలన్నారు.

రామమందిరంలో పూర్ణాహుతి

పర్చూరు (చినగంజాం): మండలంలోని చెన్నంబొట్ల అగ్రహారంలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో భక్తులు పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. శనివారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్త బృందంతో పాటు, భక్తులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన దాత గోరంట్ల రామానాయుడు-పద్మజ దంపతులు స్వామివార్లకు నూతన వస్త్రాలు బహూకరించి విశేష పూజలు నిర్వహించారు. గోరంట్ల వెంకటేశ్వర్లు-హైమావతిల జ్ఞాపకార్థం ఆలయాన్ని నిర్మించినట్లు దాతలు తెలిపారు.

వైభవంగా మినీ క్రిస్మస్ వేడుకలు

చీరాల రూరల్: స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆవరణలో సెయింట్ మార్క్స్ యూత్ లీగ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మినీ క్రిస్మస్ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్లు రెవరెండ్స్ కొమ్మిన జోసఫ్ కేరి, పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేడుకలలో ముఖ్య అతిథిగా బ్రదర్ పాల్గొని దేవుని వాక్య సందేశాలు అందించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, ట్రెజరర్ ఆనంద్‌బాబు, పీసీసీ, ఎల్‌సీసీ, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు, సంఘస్థులు పాల్గొన్నారు.


దేవుని గీతాలు ఆలపిస్తున్న యూత్ సభ్యులు

సంక్షేమ పథకాలు సీఎం జగన్‌తోనే సాధ్యం


కరపత్రాలు అందిస్తున్న పార్టీ నాయకులు

చీరాల: రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ చీరాల మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి అన్నారు. శనివారం చీరాల రూరల్ మండలం గాంధీనగర్ సచివాలయ పరిధిలో పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సూచనలతో ఆంధ్రప్రదేశ్‌కి జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల ఇన్‌చార్జి బుర్ల సాంబశివరావు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎన్.రాజ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు, చిన్ని లీలాధరరావు, వలివేటి రాము, చారుగుళ్ల గురుప్రసాద్, ఐ.మురళి, వలివేటి సతీష్, నూనె వెంకటసుబ్బారావు, అచ్చుత శ్రీనివాసరావు, చిన్ని సత్యనారాయణ, బుర్ల మురళి, పి.ధనుంజయ, పి.శ్రీనివాసరావు,గుంటూరు వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మినుము, శనగ సాగు వాయిదా వేసుకోవాలి


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

జే.పంగులూరు: మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో శనివారం మినుము పంట నూర్పిడిని ఏఓ సుబ్బారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మిచాంగ్ తుపాను కారణంగా రెండు రోజులు పలు చోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపారు. వర్షాలు దృష్ట్యా మినుము, శనగ రైతులు పంటల విత్తుకోవడానికి కొన్ని రోజులు ఆపుకోవాలన్నారు. వర్షపు నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు పొలం నుంచి నీరు తీసివేయాలి. అధిక వర్షాలకు ఆకు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దానికి సంబంధించి కార్బండిజం 1 గ్రా. లీరు నీటికి లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

రెండు లారీలు ఢీ, వ్యక్తికి గాయాలు

మేదరమెట్ల: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జాతీయ రహదారి పోలీసు స్టేషన్ సమీపంలో శనివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపుకు వెళ్తున్న లారీ మేదరమెట్ల హైవే కేఫ్ సమీపానికి రాగానే ఒక్కసారిగా ఆపాడు. ఈక్రమంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఆగిఉన్న లారీని ఢీకొంది. వెనుక నుంచి ఢీకొన్న లారీ క్యాబిన్ దెబ్బతినడంతో లారీ డ్రైవర్ వేముల ఏడుకొండలు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే పోలీసులు క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్‌ను బయటకు తీసి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

– మరో ప్రమాదంలో బొడ్డువానిపాలెం సమీపంలో లారీని ఢీకొన్న కెమికల్ వాటర్ ట్యాంకర్ ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్ నుంచి చెన్నైకు గోధుమల లోడుతో వెళ్తున్న లారీ బొడ్డువానిపాలెం సమీపంలోకి రాగానే కోదాడ నుంచి నెల్లూరుకు కెమికల్ వాటర్ ట్యాంకర్ ముందు వెళ్తున్న లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

ఓటు హక్కుతో మెరుగైన ప్రజాస్వామ్యం


ఈపురుపాలెంలో సిబ్బందికి సూచనలు అందిస్తున్న ఏఈఆర్వో ప్రభాకరరావు


వైదనలో పోలింగ్ బూత్ పరిశీలించి సూచనలిస్తున్న తహశీల్దార్

చీరాల టౌన్: ఓటు హక్కుతో మెరుగైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని అదనపు ఎన్నికల అధికారి, చీరాల తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం తహశీల్దార్ చీరాల పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలతో పాటుగా మండలంలోని తోటవారిపాలెం, ఈపురుపాలెం, బుర్లవారిపాలెం, వాడరేవు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందాలి.. నూతన ఓటు హక్కు నమోదు, ఓటు పోలింగ్ స్టేషన్ల మార్పు, సవరణల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తహశీల్దార్ వెంట ఆర్‌ఐలు అర్జున్, శేఖర్, ఏఎస్‌వో రామకృష్ణ, వీఆర్వోలు ఉన్నారు.

ప్రత్యేక శిబిరంలో 158 దరఖాస్తులు

బల్లికురవ: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం మండలంలోని 56 పోలింగ్‌బూత్‌లో జరిగిన ప్రత్యేక శిబిరంలో 158 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ కే. రవిబాబు అన్నారు. చేర్పులకు 57, తొలగింపులకు 45, సవరణకు 56 దరఖాస్తులు అందాయని ఆదివారం కూడా అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

చినగంజాం: త్వరలో జరగబోవు ఎన్నికల దృష్ట్యా ఎన్నికల అధికారుల ఆదేశాలతో శని, ఆదివారాల్లో ప్రతి మండలంలో నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్‌ను పటిష్టంగా నిర్వహించాలని తహశీల్దారు పీ పార్వతి అన్నారు. ఆమె మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సామాజిక సేవలో రోటరీ ముందంజ


రోగులకు పండ్లు పంచిపెడుతున్న గవర్నర్ శంకరరెడ్డి, సభ్యులు

చీరాల రూరల్: సామాజిక సేవలో రోటరీ ముందంజలో ఉంటుందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసి శంకరరెడ్డి అన్నారు. శనివారం చీరాల రోటరి క్లబ్ క్షీరపురి అధ్యక్ష, కార్యదర్శి నన్నపనేని రామకృష్ణ, నాగ మల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో వాటర్ మోటార్‌ను ప్రారంభించారు. అనంతరం రోగులకు పండ్లు, బాలింతల శిశువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా నిరుపేదల సౌకర్యార్థం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ సుభాషిణి, అసిస్టెంట్ గవర్నర్ దోగుపర్తి వెంకట సురేష్, బండారుపల్లి హేమంత్ కుమార్, డాక్టర్ తాడివలస దేవరాజు, అడ్డగడ్డ మల్లికార్జున, ముప్పల వంశి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ఎస్. రవితేజ, రావి వెంకట రమణారావు, హనుమంతరావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రాజు వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దూరం వెళ్లి.. పింఛన్ అందించి

కారంచేడు: అనారోగ్యంతో ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండి చికిత్స పొందుతున్న వృద్ధురాలికి గ్రామ వలంటీరు ఒంగోలు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. శనివారం మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన నున్న వెంకటేశ్వరమ్మ ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సర్జరీ చేయించుకోవడానికి ఒంగోలులో ఉన్నారు. పింఛన్ పంపిణీకి ఇంటికి వెళ్లిన వలంటీరు పూల వెంకటనాగగోపి ఇంటి వద్ద ఆమె లేకపోవడంతో విషయం తెలుసుకొని ఒంగోలు ఆసుపత్రికి అందించారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది.


ఒంగోలులో వెంకటేశ్వరమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగగోపి

చిలకలూరిపేట వెళ్లి..

పర్చూరు (ఇంకొల్లు): గుండెకు సంబంధించిన వ్యాధితో ఇబ్బంది పడుతూ చిలకలూరిపేటలో ఉంటున్న కుమారుని ఇంటి వద్ద ఉంటున్నాడు షేక్‌బాషా. అక్కడకు వెళ్లి వలంటీరు పింఛన్ పంపిణీ చేసింది. మండలంలోని ఉప్పుటూరు గ్రామానికి చెందిన షేక్ చినబాషాకు పింఛన్ అందించేందుకు వలంటీరు షేక్ నజియా చిలకలూరిపేట వెళ్లి అందించింది. దీంతో లబ్ధిదారుడు సంతోషం వ్యక్తం చేశాడు.


చిలకలూరిపేట వెళ్లి వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ నజియా